

శ్రీశైల దేవస్థానం ప్రత్యేక అధికారిగా చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో కార్తీకమాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు ఎస్. సత్యనారాయణ శ్రీశైలం దేవస్థానానికి స్పెషల్ ఆఫీసరుగా ఆర్‌జేసి ఎస్. ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. శ్రీశైలంలో జరిగే కార్తీక మాసోత్సవాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన పర్యవేక్షణకు ఆర్‌జేసి ఎస్. ఎస్. చంద్రశేఖర్ ఆజాద్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





● విద్యార్థులను వేధిస్తున్న తాగు నీటి సమస్య
● పైపులైన్ నిర్మించినా నీటిని మళ్లించని దుస్థితి
● వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా ● ఏడాదికి రూ.75 లక్షల ఖర్చు

రాయలసీమ వర్సిటీలో దాహం కేకలు..!



కర్నూలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):
రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యార్థులు నీటి సమస్యతో తల్లడిల్లుతున్నారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు తాగునీరు సరఫరా చేయడం లేదు. దీంతో వర్సిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి కోసం నెలకు రూ.6.50 లక్షలు చొప్పున ఏడాదికి సరాసరి రూ.75 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. యూనివర్సిటీకి ఇది ఆర్థిక భారమే కాక.. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కర్నూలు నగర శివారున 2008లో రాయలసీమ యూనివర్సిటీని స్థాపించారు. యూజీసీ అక్రిడిటేషన్ కలిగిన ఈ వర్సిటీలో 14 పీజీ, యూజీ కోర్సులు, అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాల కూడా ఉంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,200 మంది విద్యార్థులు పీజీ సహా ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఇంజనీరింగ్ కోర్సు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు యూనివర్సిటీ హాస్టళ్లలో ఉంటూ చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బాలికల హాస్టల్‌లో 470 మంది, బాలుర హాస్టల్‌లో 450 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య విద్యార్థులతో పాటు అధ్యాపకులను వెంటాడుతోంది. నీటి సమస్య తీర్చాలంటూ 15 ఏళ్లుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఏ ప్రభుత్వం కూడా వర్సిటీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వేసవి కాలంలో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శుద్ధి చేసిన తాగునీటి సరఫరా చేయాలంటూ 2016లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి కలెక్టరు కర్నూలు కార్పొరేషన్ అధికారులతో చర్చించి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్ ఇంజనీర్లు రూ.1.13 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దీంతో యూనివర్సిటీ అధికారులు రూ.81.68 లక్షలు చెల్లించారు.

మిగతా 6లో..

ఈకేవైసీ తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుకు అర్హత ఉన్న వారందరూ దీపం-2 పథకంలో లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకంపై జేసీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పథకానికి సిక్స్ స్టెప్స్ వాల్యుయేషన్ ఉందన్నారు. ల్యాండ్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌పోర్ట్, ఇన్‌కమ్ ట్యాక్స్, ఇంటి పన్ను తదితర వాటిని ఆధారంగా చేసుకుని అర్హత నిర్ణయిస్తామన్నారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ కనెక్షన్‌కు రేషన్ కార్డు, ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఈకేవైసీ ఖచ్చితంగా చేసుకోవాలన్నారు. ఈ పథకంపై సందేహాలను 1967 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఆధార్ లింక్ కలిగిన బ్యాంకు ఖాతాలో 24 గంటల నుంచి 48 గంటలలోపు నగదు జమ అవుతుందన్నారు. లబ్ధిదారులు సిలిండర్లను ఇళ్లలో మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కమర్షియల్‌గా వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గాయపడ్డ పెద్దపులి కోసం గాలింపు

● కెమెరా ట్రాప్‌ల ఏర్పాటు
● ఎఫ్‌డీపీటీ డీడీ అనురాగ్ మీనా ఆధ్వర్యంలో..



గాలింపు చేపడుతున్న అధికారులు

రుద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని రుద్రవరం రేంజ్ అహోబిలం నార్త్ బీట్‌లో కారు ఢీకొని గాయపడిన పెద్దపులి కోసం గురువారం ఎఫ్‌డీపీటీ డీడీ అనురాగ్‌మీనా ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. ఎన్ఎస్‌టీఆర్ నుంచి ఒక బృందం, ఆత్మకూరు నుంచి రెస్క్యు టీం రంగంలోకి దిగాయి. అలాగే డ్రోన్ కెమెరాతో పెద్దపులి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. సుమారు 25 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. మొదటిరోజు గాలింపులో పులి ఆచూకీ లభించలేదు. శుక్రవారం కెమెరా ట్రాప్‌లలో పులి ఆచూకీ తెలుస్తుందని ఫారెస్టు అధికారులు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు సెక్షన్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపులి కేసులో కారు డ్రైవరు అరెస్టు

రుద్రవరం రేంజ్‌లోని అహోబిలం నార్త్ బీట్ రహదారిలో పులి గాయపడ్డ ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను గురువారం అరెస్టు చేసినట్లు రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వెంకటరమణను నంద్యాల కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

రూ.98.32 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం



విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభోత్సవానికి వేచి ఉన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

బేతంచెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మూరు కొట్టాల గ్రామ సమీపంలో రూ.98.32 కోట్లతో నిర్మించిన 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఏడీలు మాట్లాడుతూ విద్యుత్ ఉప కేంద్రం ద్వారా బేతంచెర్ల, డోన్, బనగానపల్లె మండలాలకు చెందిన 80 వేల మంది విద్యుత్ వినియోగదారులుకు ఉపయోగపడుతుందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఏడీ బాబు రాజేంద్ర, ప్రకాష్‌లు అన్నారు. విద్యుత్ ఉప కేంద్రం ద్వారా బేతంచెర్ల మండలానికి లోవోల్టేజీ సమస్య లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ట్రాన్స్‌కో ఏఈ రఫీ, నంద్యాల విద్యుత్ ఎస్‌ఈ సుధాకర్ కుమార్, డోన్ ఈఈ ప్రసాద్ రెడ్డి, మండల విద్యుత్ ఏడీలు గోపినాథ్, మధుసూదన్ రెడ్డి, ఏఈలు రఫీ, పుల్లయ్య, శ్రీనివాసులు, నరసయ్య విద్యుత్ ఉన్నతాధికారులు డోన్ టీడీపీ యువ నాయకులు రాఘవేంద్రరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, టీడీపీ మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

కర్నూలు లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల డిసెంబరు 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో గురువారం స్థానిక పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు ఎలాంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టులలో ఈ జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులందరూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో చురుకుగా పాల్గొని రాజీకీయ అర్హత కలిగి ఉన్న క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేందుకు సహకరించాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మున్సిపల్, భూసేకరణ కేసులతో పాటు అన్ని సివిల్ కేసులను, ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం. వెంకట హరినాథ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ. లీలా వెంకట శేషాద్రి, పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది

రేపు శ్రీశైలానికి సీఎం చంద్రబాబు

శ్రీశైలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రానికి శనివారం సీఎం నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనం తరం పాతాళగంగలోని సీప్లేన్ ల్యాండింగ్ పాయింట్, సర్వీసును ప్రారంభిస్తారు. ఈ మేరకు గురువారం రాత్రి కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ జి.విష్ణు చరణ్ అధికారులతో కలిసి శ్రీశైలం ఆలయంలో ఏర్పాట్లను, రోప్ వే ఎంట్రీ పాయింట్, పాతాళగంగ బోటింగ్ పాయింట్ ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

టీడీపీ నాయకుడి దౌర్జన్యాలు అరికట్టండి

● ఆళ్లగడ్డ చికెన్ వ్యాపారుల ఆవేదన
● ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



ఫిర్యాదు కాపీని చూపుతున్న బాధితులు

నంద్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ వ్యాపారాలకు అడ్డు తగులుతూ వేధింపులకు గురి చేస్తున్న ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి దౌర్జన్యాలను అరికట్టాలంటూ చికెన్ సెంటర్ల వ్యాపారులు గురువారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చికెన్ వ్యాపారి హుసేన్ బాషా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ముఖ్యం గా ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అనుచరుడు హర్షవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి చికెన్ వ్యాపారం చేసుకోవాలంటే తన వద్దనే సరుకు తీసుకోవాలని లేకపోతే కేసులు ఎదుర్కొవాల్సి వస్తుందని బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్ ద్వారా తమ చికెన్ దుకాణాన్ని మూసివేయించారని, గతంలో కూడా హర్షవర్ధన్‌రెడ్డి తమ వారికి చెందిన భూమిని కబ్జా చేసేందుకు యత్నించాడన్నారు. అతడి వల్ల తమకు ప్రాణహాని ఉందని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పారాలో పతకాలు

స్ఫూర్తి

- అంతర్జాతీయ పారా రోయింగ్‌లో రాణిస్తున్న ప్యాపిలి యువకుడు
- ప్రధాని నుంచి ప్రసంశలు అందుకున్న నారాయణ



రోయింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు నారాయణ

ప్యాపిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలి క్రీడాకారుడు రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పతకాల పంటను పండిస్తున్నారు. ఇటీవల జరిగిన పారా ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొన్న యువకుడు నారాయణ ప్రధాని మోదీచే ప్రసంశలు పొందాడు.

ప్యాపిలి పట్టణానికి చెందిన కొంగనపల్లి వెంకటస్వామి, సుంకమ్మ దంపతుల రెండో కుమారుడు కొంగనపల్లి నారాయణ. వీరిది వ్యవసాయ కుంటుంబం. ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి ఇష్టపడలేదు. అయితే ఆర్మీలో చేరి దేశానికి తనవంతు సేవలందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్న నారాయణ తల్లిదండ్రులను, అన్నను ఒప్పించి ఇంటర్ వరకు చదివాడు. ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమతలేక మధ్యలోనే చదువు ఆపేశాడు.

తొలి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం

ఇంటర్మీడియట్‌ను 2005-06లో పూర్తి చేసిన కొంగనపల్లి నారాయణ 2008లో తొలి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం సాధించి తన లక్ష్యాన్ని సాధించాడు. రెండేళ్ల పాటు బెంగుళూరులో ఆర్మీలో శిక్షణ తీసుకున్న యువకుడు మొదటిసారి సికింద్రాబాదులో విధుల్లో చేరారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి అధికారుల ప్రసంశలు పొందాడు.

విధి నిర్వహణలో కాలు కోల్పోయిన నారాయణ

2015 సంవత్సరంలో జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో శత్రుదేశం ఏర్పాటు చేసిన మందుపాతర పేలడంతో నారాయణ కాలు పూర్తిగా దెబ్బతిన్నది. దాదాపు 5నెలల పాటు వైద్యం చికిత్సలు చేసిన గాయం నయం కాలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వైద్యులు నారాయణ కుడి కాలు పాదాన్ని తీసివేశారు. దీంతో యువకుడు నారాయణ పుణేలో కృత్రిమ పాదాన్ని అమర్చుకున్నాడు.

పారా రోయింగ్ క్రీడపై దృష్టి

పాదం కోల్పోవడంతో మానసికంగా కృంగిపోతున్న నారాయణను చూసి చలించిన ఆర్మీ ఉన్నతాధికారి రోయింగ్ క్రీడపై అవగాహన కల్పించారు. ఈ క్రీడ వలన ప్రపంచస్థాయి గుర్తింపు పొందవచ్చని నారాయణకు ఆత్మస్థైర్యాన్ని నింపారు. దీంతో నారాయణ అధికారి సూచన మేరకు రోయింగ్ క్రీడపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..



రోయింగ్ శిక్షణ పూర్తి చేసిన నారాయణ మొదటిసారి 2017లో రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని విజయాల పరంపర కొనసాగించారు. ఆయా పోటీల్లో దాదాపు 30 పతకాలు సాధించారు. దీంతో పారారోయింగ్‌లో నారాయణ ప్రతిభను ఆర్మీ ఉన్నతాధికారులు ప్రసంశించారు.

పతకం రాకపోయినా...

ఇటీవల పారిస్‌లో జరిగిన పారా రోయింగ్ పోటీల్లో నారాయణ మన దేశం తరపున పాల్గొన్నారు. ప్రపంచంలోని రోయింగ్ క్రీడల్లో పోలెండ్, దక్షిణ కొరియా, హాంకాంగ్ తదితర దేశాలతో ఒలింపిక్స్‌లో తలపడ్డాడు. అయితే పోటీల్లో 8వ స్థానంలో నిలిచిన నారాయణకు ఒలింపిక్స్‌లో ఏ పతకం అందకపోవడంతో నిరాశ చెందాడు. భారత్ తరపున ఒలింపిక్స్‌లో పాల్గొన్న నారాయణను ఢిల్లీలో ప్రధాని మోదీ అభినందించడం విశేషం. ఒలంపిక్స్‌లో పతకం రాకపోయినా తన రోయింగ్ క్రీడను కొనసాగిస్తానని నారాయణ తెలిపారు.



ప్రధాని మోదీతో నారాయణ

పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలి



మంత్రి ఫరూక్‌ను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, న్యాయవాదులు ఉన్నారు.

దేవదాయ శాఖ సూపరింటెండెంట్‌పై కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు దేవదాయ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరెడ్డి సూపరింటెండెంట్‌గా పని చేస్తూ రూ.2 కోట్లకు పైగా నిధులు తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారాన్ని విచారించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

20 నుంచి జీడీపీ నీటి విడుదల

- జలాశయంలో 2.2 టీఎంసీల నీరు మాత్రమే..
- వేసవిలో తాగునీటి పథకాలకు ఇబ్బంది లేదు
- హంద్రీనీవా నీరు తీసుకురావాలి - రైతుల డిమాండ్



పంటలకు సాగు నీరు అందించేందుకు సిద్ధంగా ఉన్న కుడి, ఎడమ కాలువలు



ఆయకట్టు రైతులు సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

గోనెగండ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు. అయితే గత ఏడాది నుంచి ప్రాజెక్టు కట్ట ఎత్తు పెంచేందుకు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో గత ఏడాది అధికారులు ఆయకట్టు రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది తప్పని సరిగా పంటలకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. జీడీపీ కింద ఆయకట్టు 24వేల ఎకరాలు ఉంది. కాగా ప్రతి ఏడాది కుడి, ఎడమ కాలువల కింద 13వేల ఎకరాలకు మించి సాగు కావడంలేదు. ఈ ఏడాది కూడా అంతే సాగు అవుతుందని రైతులు తెలుపుతున్నారు.

డీడీఆర్‌సీ సమావేశంలో అసలు విషయం

గత ఏడాది ప్రాజెక్టు మరమ్మతు పనులు, అలాగే ప్రాజెక్టులో కేవలం 0.52 టీఎంసీ నీరు ఉన్న కారణంగా అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో రైతులు తమ భూములను బీడు భూములుగా మార్చుకోవాల్సి వచ్చింది. కాని ఈ ఏడాది ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు నిలువ ఉంది కాబట్టి ఈ ఏడాది ఎలాగైన రబీలో పంటలకు సాగునీరు ఇవ్వలని రైతులు కోరారు. డీడీఆర్‌సీ సమావేశం జరగడంతో అడ్డంకి తొలగి నీరు ఇవ్వడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ఆయకట్టు రైతులతో జీడీపీ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ఎన్ని వేల ఎకరాలకు ఎప్పటి నుంచి నీరు ఇచ్చేంది ప్రకటించనున్నారు.

హంద్రీనీవా నీరు తీసుకురావాలి

ఈ ఏడాది రబీసాగుకు ప్రాజెక్టులో నీరు సరిపోక పోతే హంద్రీనీవా నుంచి 3 టీఎంసీల నీరు మళ్లించి ప్రాజెక్టులో నిలువ చేసి ఆయకట్టు రైతుల పంటలకు తగినన్ని నీరు అందించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నాయకులు, అధికారుల హంద్రీ నీవా నీరు ప్రాజెక్టుకు మళ్లించిన సంఘటలు ఉన్నాయి. కాబట్టి నీటిని మళ్లించి తీసుకువచ్చి రైతుకు అందిస్తారని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలకు సిద్ధమవుతున్నారు.

తాగునీటి పథకాలకు ఇబ్బంది లేదు:

జీడీపీ కింద డోన్, క్రిష్ణగిరి, బండగట్టు, కోడుమూరు, కర్నూలు, గూడురు తదితర ప్రాంతాలతో పాటు ఎమ్మిగనూరు ప్రాంతానికి కూడా కొత్తగా నీటి పథకం కింద నీరు ఇవ్వాలి. అయితే ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు ఉంది. 13 వేల ఎకరాలు సాగు అయితే సాగుకు గాను 1.3 టీఎంసీ నీరు పోతే మిగతా నీటితో తాగునీటి పథకాలకు ఇబ్బంది ఉండదు. దీనికి తోడు నీరు హంద్రీనీవా నుంచి విడుదల అయ్యే అవకాశం ఉండటంతో వచ్చే వేసవిలో తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది ఉండదు.

పంటలు చేతికి అందే వరకు నీరు విడుదల చేయాలి



గత ఏడాది ప్రాజెక్టులో నీరు లేని కారణంగా పొలాలు బీడు భూములుగా మారిపోయాయి. ఈ ఏడాదైనా పంటలు చేతికి అందేవరకు అధికారులు మార్చి నెల అఖరు వరకు నీరు విడుదల చేయాలి. అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే ఒప్పుకునేది లేదు. హంద్రీనీవా నీటిని తప్పని సరిగా తీసుకువచ్చి సాగు, తాగునీటి సమస్య లేకుండా చూడాలి.

-కేవీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ, జీడీపీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు

రబీలో సాగు నీరు విడుదల చేస్తాం

జీడీపీ కింద ఎన్ని వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలో అధికారులు నిర్ణయిస్తారు. ఆ ప్రకారంగా నవంబరు నెల 15 నుంచి 20 వ తేదీలోపు ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలి. ప్రాజెక్ట్‌లో 2.2 టీఎంసీ నీరు ఉంది. కాబట్టి సాగు నీటి విడుదలకు ఇబ్బంది లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేస్తాం.

-విజయ్‌కుమార్, జీడీపీ డీఈ

రాయలసీమ వర్సిటీలో దాహం కేకలు..!

(5వ పేజీ తరువాయి)

కర్నూలు కార్పొరేషన్ అధికారులు యూనివర్సిటీకి తాగునీటి పైపులైన్ వేసినా రెండు మూడు నెలలు మాత్రమే నీటిని విడుదల చేశారు. ఆ తరువాత పైపులను క్లోజ్ చేశారు. అప్పటి నుంచి ఎనిమిదేళ్లుగా వర్సిటీలో నీటి సమస్య జటిలమైంది. కార్పొరేషన్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యం. తాగునీరు మాత్రం ఇవ్వడం లేదు. అదే సమయంలో బోర్లు కూడా పని చేయడం లేదు. దీంతో విద్యార్థుల అవసరాల కోసం రోజుకు బాలికల హాస్టల్‌కు 30 ట్యాంకులు, బాలుర హాస్టల్‌కు 25-30 ట్యాంకులు ఒక్కో ట్యాంకు రూ.320 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. అలాగే.. తాగడానికి ఆర్‌వో వాటర్ వ్యాన్ల నీటి కోసం రూ.5.500 ఖర్చు చేస్తున్నారు. దినసరి అవసరాలకు కోసం, తాగునీటి కోసం రోజుకు సరాసరి రూ.21 వేలు చొపున నెలకు రూ.6.30 లక్షలు, ఏడాదికి రూ.75 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. కార్పొరేషన్ నీటిని సరఫరా చేస్తే దాదాపు సగానికి పైగా ఖర్చు తగ్గడమే కాకుండా శుద్ధి చేసిన స్వచ్ఛమైన తుంగభద్ర జలాలు అందుతాయి. నగరపాలక సంస్థ నుంచి నీటి సరఫరా చేయకపోవడంతో రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, జిల్లా యంత్రాంగం స్పందించి కార్పొరేషన్ ద్వారా నీటిని సరఫరా చేసి రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల దాహం తీర్చాలని పలువురు కోరుతున్నారు.



నీటి సమస్య వాస్తవమే

యూనివర్సిటీలో నీటి సమస్య వాస్తవమే. విద్యార్థుల రోజువారి అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా, తాగునీటి కోసం ఆర్‌వో వాటర్ కొనుగోలు చేస్తున్నాం. రోజుకు దాదాపుగా రూ.20 వేలు ఖర్చు చేస్తున్నాం. ఒకబోరు రిపేరి చేయించడం వల్ల కొంతవరకు ఆదా చేయగలిగాం. కర్నూలు కార్పొరేషన్ నుంచి శుద్ధి చేసిన నీటిని సరఫరా కోసం పైపులైన్ ఉన్నా.. నీళ్ల రావడం లేదు. 2016లో నీటి కోసం కార్పొరేషన్‌కు రూ.81.68 లక్షలు చెల్లించాం.

-ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, రాయలసీమ వర్సిటీ, కర్నూలు

రేడియాలజీ.. ఓ అద్భుతం...



- ఎక్స్‌రే నుంచి ఎంఆర్‌ఐ వరకు
- 'ఎక్స్' కిరణాల ఆవిష్కరణతో విప్లవాత్మక మార్పులు
- నేడు వరల్డ్ రేడియాలజీ డే

కర్నూలు హాస్పిటల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గుండె రక్తనాళాల్లో పూడికలు గుర్తించాలంటే యాంజియోగ్రామ్ చేసేవారు. ఇప్పుడు ఆసుపత్రిలో అడ్మిషన్ అవసరం లేకుండా సిటీ స్కాన్ అందుబాటులో వచ్చింది. ప్రారంభంలో సింగిల్ స్కాన్‌లు ఉండేవి. డ్యూయల్ 4, 8, 16, స్లయస్ నుంచి ప్రస్తుతం 250, 320, స్లయస్ సిటీ స్కాన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. గుండె, కిడ్నీ, మెదడు, లివర్ వ్యాధులతో పాటు రక్తనాళాల్లోని లోపాలను గుర్తించే అత్యాధునిక సిటీ స్కాన్‌లు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా కర్నూలు జీజీహెచ్ రేడియాలజీ విభాగంలో ఈ విధానాలు ప్రొసిజర్స్ అందుబాటులో ఉన్నాయి.

> రేడియాలజీ ఆవిష్కరణ తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మానవ, జంతువుల శరీరాలను ప్రభావితం చేసే పరిస్థితులను గుర్తించడానికి, చికిత్స చేయడానికి ఇమేజింగ్ సాంకేతికతను ఉపయోగించే వైద్యరంగంలో, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో రేడియాలజీకి అద్భుతమైన పాత్ర ఉంది. 1895లో జర్మనీకి చెందిన ప్రొఫెసర్ రాంట్‌జన్ అనుకోకుండా ఎక్స్‌రే కిరణాలను కనుగొన్నారు. ఆయన పుట్టిన రోజు నవంబరు 8న వరల్డ్ రేడియాలజీ డేను నిర్వహించడం ఆనవాయితీ. 2024న రేడియో గ్రాఫర్స్ సీయింగ్ ది అన్‌సీన్ అన్న నినాదాన్ని ఇచ్చారు.

ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ఓ ప్రత్యేకం

రేడియాలజీ విభాగంలో ఓ ప్రత్యేక రంగం ఇంటర్వెన్షనల్ రేడియాలజీ. ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు గా డా. బి.అరుణ్ కుమార్ కర్నూలు జీజీహెచ్‌లో సేవలు అందిస్తున్నారు. ఆపరేషన్, కోత లేకుండా రక్తనాళాల ద్వారా మందులు ఇచ్చే ఈ ప్రక్రియలో డా.అరుణ్ కుమార్ ఎన్నో ప్రొసిజర్స్ నిర్వహించారు.



కర్నూలు జీజీహెచ్‌లోని రేడియాలజీ విభాగం

కర్నూలు జీజీహెచ్‌లో రికార్డు స్థాయిలో సేవలు

కర్నూలు జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగం 1958లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 20 మంది పీజీలు ఉన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు పక్కనున్న తెలంగాణ గద్వాల జిల్లా, వనపర్తి జిల్లాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ప్రతి నెల ఎక్స్‌రేలు 10వేల మందికి గాను 30 వేల ఎక్స్‌రేలు, అల్ట్రాసౌండ్ పరీక్షలు నెలకు 10వేలు, సిటీ స్కాన్‌లు నెలకు 4622, ఎంఆర్‌ఐ నెలకు 1825, బయాప్సీ పరీక్షలు 120 దాకా చేస్తుంటారు. ఈ విభాగంలో డైరెక్టు డిజిటల్ రేడియోగ్రఫీ మిషన్‌తో పాటు 500 ఎంఏ యంత్రాలు నాలుగు, 300 ఎంఏ 2, పోర్టబుల్ మిషన్లు 12 ఉన్నాయి. ఇక మాగ్నటిక్ రిసోర్సెస్ ఇమేజింగ్ (ఎంఆర్‌ఐ) స్కాన్ కర్నూలు జీజీహెచ్‌లో 15 టెస్లా, సిటీ స్కాన్ 16 స్లైయిస్ అందుబాటులో ఉంది.

రేడియాలజీ గుండెలాంటిది



వైద్యరంగంలో రేడియాలజీ విభాగం గుండె కాయలాంటిది. క్యాన్సర్, పగుళ్ల, ఇన్‌ఫెక్షన్‌ల వంటి పరిస్థితులను ముందుగానే గుర్తించడానికి రేడియాలజీ ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా ఛాతి 'ఎక్స్' కిరణాలు న్యూమోనియా లేదా ఊపిరితిత్తుల వ్యాధుల తీవ్రతను గుర్తించడంలో సహాయపడతాయి. ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్‌తో పాటు ఇంటర్వెన్షనల్ రేడియాలజీలో ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన పరీక్షలు, చికిత్స అందిస్తున్నాం.

-డా.డి. హరినాథ్, అసోసియేట్ ప్రొఫెసర్, రేడియాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్

రేడియాలజిస్టుల పాత్ర కీలకం



గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం నుంచి వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల వరకు నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్ర ఎంతో కీలకం. ఎక్స్‌రే నుంచి డిజిటల్ ఎక్స్‌రే, సిటీ, ఎంఆర్‌ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్లు వరకు ఇంటర్వేన్షనల్ రేడియాలజీ సేవలు వైద్యరంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ప్రతి నెల 30వేల ఎక్స్‌రేలు, 10వేల అల్ట్రాసౌండ్, 4622 సిటీ, ఎంఆర్‌ఐ, 1825 వరకు ప్రతి నెల నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రేడియాలజీతో పాటు ఇంటర్వేన్షనల్ రేడియాలజీ ప్రొసీజెస్ నిర్వహిస్తున్నాం.

- డా.కే. రాధారాణి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, రేడియాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు



వైసీపీ నేతల కబ్జాలు నిరూపిస్తాం

- ఎక్కడ గొడవలు జరిగినా మంత్రిపై నెపమా..?
- నిరాధార ఆరోపణలు చేస్తే కేసులు పెడతాం
- మండిపడిన కార్పొరేటర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు భూకబ్జాలు నిరూపిస్తామని టీడీపీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కటారు పల్లవి, ఆమె భర్త కటారీ సురేష్ భూకబ్జాల గురించి తమవద్ద అన్ని సాక్ష్యాలున్నాయని, వాటిని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నగరంలో ఎక్కడ గొడవలు జరిగినా మంత్రి టీజీ భరత్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు మండిపడ్డారు. వైసీపీ కార్పొరేటర్లు తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. శ్రీరామ్‌నగరలో నిరుద్యోగ ఉపాధి కోసం బంకులు వేసుకుంటే చిన్నారులు, మహిళల పేర్లు చెప్పుకుని వైసీపీ నాయకులు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన కబ్జాలన్నింటిపై తమవద్ద సాక్ష్యాలున్నాయని టీడీపీ కార్పొరేటర్లు తెలిపారు. నగర అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత మేయర్ బీవై రామయ్యకు లేదన్నారు. కార్పొరేటర్లు పరమేష్, క్రాంతి కుమార్, పరాజ్ ఖాన్, జకియా అక్సారీ, విజయకుమారి, కైపా పద్మలత, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలు తక్షణమే ఆపాలి



సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రశర్మ

- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండలం చుట్టుపక్కల గ్రామాలలో యురేనియం తవ్వకాలు తక్షణమే ఆపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో గురువారం సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బి. రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ యురేనియాన్ని భూమిలోంచి వెలికి తీస్తే చుట్టుపక్కల దాదాపు 100 కి.మీ మేర దాని ప్రభావం ఉంటుందన్నారు.

కప్పట్రాళ్లకు చెందిన యురేనియం తవ్వకాల వ్యతిరేక ఉద్యమకారుడు రవీంద్రశర్మ మాట్లాడుతూ తమ గ్రామం వద్ద యురేనియం తవ్వకాలకు 68 బోర్లు వేసుకునేందుకు అటవీ శాఖ అనుమతి ఇచ్చిందని అన్నారు. అన్ని పార్టీలు ఏకమై ఈ తవ్వకాల ఉత్త ర్వులు రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట యురేనియం తవ్వకాలపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సదస్సులో తీర్మానించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి నాగన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ ప్రసంగించారు.

స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వండి



- డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలకు స్పష్టమైన ఎండార్స్‌మెంటు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలకు సరైన ఎండార్స్ మెంటు ఇచ్చేలా అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌కు వచ్చిన దరఖా స్తులను పరిష్కారంలో అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లో నాణ్యతను పెంచడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ఆఖరి క్షణంలో వస్తోం దని, అలా కాకుండా అర్జీ పరిష్కారం కోసం 30 రోజుల సమయం ఉంటుంది కాబట్టి పది రోజులకు ముందే ఎంక్వైరీ రిపోర్టు ఎండార్స్ మెంటును డీఆర్వోకు అందజేయాలన్నారు. రానున్న రోజుల్లో గ్రీవెన్స్ పరిష్కరించే అధికా రులకు అందరికీ లాగిన్స్ ఇస్తారని అన్నారు. పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మీ, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన సీఎం హామీ

- పుచ్చకాయలమడలో ట్యాంకు పనులు ప్రారంభం



ట్యాంకు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయలమడ గ్రామ పర్యటనలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పుచ్చకాయలమడ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజచేశారు. సీఎం హామీల నెరవేర్పులో ముందుగా ట్యాంకు నిర్మిస్తున్నామని త్వరలోనే మిగిలిన హామీలను పూర్తిచేస్తామన్నారు. సర్పంచ్ హరితారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బత్తిన లోక్‌నాథ్, డీఎల్‌పీవో భద్రప్ప, ఇంచార్జి ఎంపీడీవో స్వర్ణలత, ఈవోఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన అమ్మ



గుంతకల్లులో కొడుకు ఇంటికి చేరిన వృద్ధురాలు తిరుపతమ్మ

- ఈనెల 1న అర్ధరాత్రి రోడ్డుపై వదిలేసి వెళ్లిన కొడుకు
- కొడుకు, కూతుళ్లకు కౌన్సెలింగ్
- సీనియర్ సిటిజన్ యాక్టు కింద కేసు నమోదు
- మరో అవకాశం ఇచ్చిన ఆర్డీవో
- ఎట్టకేలకు ఇంటికి చేరుకున్న వృద్ధురాలు తిరుపతమ్మ

పత్తికొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధిపాలైన ఆ తల్లి ఎట్టకేలకు గూటికి చేరుకుంది. కన్న కొడుకు నిర్దాక్షిణ్యంగా అర్ధరాత్రి నడిరోడ్డుపై వదిలేసి వెళ్లాడు. వృద్ధాప్యంలో తల్లిని చంటి పాపలా చూసుకోవాల్సిన కొడుకులకు, కూతుళ్లకు ఆమె భారమైంది. తల్లిని, ఆమె ఆత్మగౌరవాన్ని వీధిలోకి విసిరేసిన సంతానం మీద సీఐ సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద సుమోటోగా కేసు నమోదు చేశాడు.

ఆత్మీయంగా, బాధ్యతా యుతంగా ఉండాల్సిన తల్లీబిడ్డల సంబంధాల్లో పిల్లల అమానవీయ ధోరణిని చివరికి చట్టం సరి చేయాల్సి వచ్చింది. ఈ నెల ఒకటో తేదీ వీధిపాలైన తిరుపతమ్మ కేసు ఎట్టకేలకు 6 రోజుల తర్వాత పరిష్కారమైంది. గురువారం రాత్రి గుంతకల్‌లోని కొడుకు శ్రీనివా సులు ఇంటికి చేరింది. పత్తికొండ సీఐ జయన్న తిరుపతమ్మను పత్తికొండ ఆసుపత్రిలో చేర్పించి కొడుకు శ్రీనివాసులుతోపాటు కుమార్తెలను స్టేషన్‌కు పిలిచి విచారించారు. రెండుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లి బాధ్యతను తీసుకునేందుకు బిడ్డలు ముం దుకు రాకపోవడంతో వారిపై ఆర్డీవో భరత్‌నాయక్ 3రోజులు గడువు ఇచ్చి, అప్పటికీ మార్పు లేకపోతే చట్టపరచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లి బాధ్యత తీసుకున్న కొడుకు, అండగా నిలిచిన కూతుళ్లు

ఆర్డీవో కౌన్సిలింగ్ తర్వాత తల్లి బాధ్యత తీసుకోడానికి కొడుకు, కూతుళ్లు ముందుకు వచ్చారు. ఆమెను కడదాకా చూసు కుంటానని కొడుకు అన్నాడు. తల్లి వైద్యం కోసం నెలనెల ఖర్చులు భరిస్తామని కూతుళ్లు ముందుకు వచ్చారు. ఈ విషయాలను సీఐ వారి నుంచి రాతపూర్వకంగా తీసుకుని సంతకాలు తీసుకున్నారు. సీఐ పత్తికొండ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తిరుపతమ్మను దగ్గరుండి డిశ్చార్జ్ చేయించి రాత్రి 7.30 గంటలకు కొడుకు, కోడలుకు అప్పగించి వారితో గుంతకల్ పంపించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం: కోట్ల



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

వెల్దుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు, అండగా ఉంటామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుడు బొమ్మన శివశంకర్‌రెడ్డి కుమారుడు బొమ్మన రమాకాంత్‌రెడ్డిని పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బలరాంగౌడు, రామకృష్ణాచారి, రామకృష్ణ పాల్గొన్నారు

డీఎస్సీ శిక్షణకు 10న ఉచిత స్క్రీనింగ్ పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 3 నెలలు ఉచిత డీఎస్సీ (ఎస్‌జీటీ, ఎస్‌ఏ)ల శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 10వ తేదీన 7 కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 797 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, కోచింగ్ సెంటర్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ పరీక్షను జ్ఞానభూమి పోర్టల్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్సు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పరీక్షకు హాజరు కావాల న్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులు కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఈ పరీక్ష ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులు 9.15 గంటల నుంచి 10 గంటల మధ్య పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. 15 నిమిషాలు గ్రేస్ టైమ్ అటే ఉదయం 10.15 గంటల వరకు అనుమతి ఉంటుందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సుందర్‌రాజు(ఫైల్)

నందవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింత క్రాస్ రోడ్డు దగ్గర సుందర్‌రాజు(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మిగనూరుకు చెందిన సుందర్‌రాజు గుజరి వ్యాపారం చేస్తు జీవనం సాగించేవాడు. రోజూ తెలంగాణలోని ఐజ ప్రాంతంలో గుజరి సామాన్లు తీసుకువచ్చి ఎమ్మిగనూరులో అమ్ముకునే వాడు. బుధవారం వెళ్లి రాత్రి ఐజ నుంచి వస్తుండగా పూలచింత క్రాస్ రోడ్డు దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని దగ్గర ఉన్న ఆధార్, ఫోన్ నెంబర్‌ను గుర్తించి వారి బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఆటోలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి వచ్చారు. తల పగిలి తీవ్ర రక్త గాయాలతో ఉన్న సుందరరాజును ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య మేరీ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభకార్యానికి వచ్చి...

కొలిమిగుండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యానికి వచ్చి ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని బెలుం గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ద్వారకచర్ల గ్రామానికి చెందిన గురుప్రసాద్(25) స్నేహితుడి సోదరి వివాహ నిమిత్తం అవుకు మండలం రామాపురం గ్రామానికి గురువారం చేరుకున్నారు. వివాహం శుక్రవారం కావడంతో గురువారం సాయంత్రం నలుగురు మిత్రులతో కలిసి కారులో కొలిమిగుండ్ల మండలం బెలుం గుహల వద్దకు వచ్చాడు. తిరిగి రామాపురం వెళుతుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. గురుప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అరవింద్ అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో పెళ్లింట విషాదం నెలకొంది. సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

కోసిగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 4వ వార్డు కొత్తపేట కాలనీకి చెందిన కురువ రాముడు, నాగమ్మ దంపతుల కుమారుడు కురువ శివ(18) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన శివ గురువారం కోసిగి సమీపంలోని తమ పొలంలో ఉన్న రేకుల షెడ్డులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.

ఫొటో స్టూడియో దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

మంత్రాలయం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్రలో ఆర్లబండ కేఎం బాషాకు చెందిన ఫొటో స్టూడియో జిరాక్స్ మిషన్లు అగ్నికి దగ్ధమయ్యాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. స్టూడియో యజమాని మధ్యాహ్నం సమయంలో తాళం వేసుకుని భోజనానికి ఇంటికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి దుకాణంలో పొగలు, మంటలు వ్యాపించడం గమనించాడు. షాపులోని డిజిటల్ ఫొటో స్టూడియో, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, నాలుగు డిజిటల్ కెమెరాలు, రెండు జిరాక్స్ మిషన్లు, ఫొటోలు, పది ఆల్బంలు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ రూ.10లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. షార్ట్ సర్క్యూట్‌తో నష్టం జరిగిందని తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

నంద్యాల క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్త చిలంకూరు పుల్లయ్యకు 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి జీవిత ఖైదు విధించినట్లు గురువారం పోలీసులు తెలిపారు. తన భార్య వేరే వ్యక్తితో చనువుగా ఉంటోందని దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో 2022 ఏప్రిల్ 8న చిలంకూరు పుల్లయ్య గొడ్డలితో నరికి చంపాడు. గోస్పాడు గ్రామానికి చెందిన పరదేశి బలదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోవెలకుంట్ల సీఐ డీవీ నారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు స్పీడ్ ట్రైల్ మానిటరింగ్ ద్వారా ఆళ్లగడ్డ డీఎస్పీ కె.రవికుమార్ పర్యవేక్షణలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరిరాముడు, దొర్నిపాడు ఎస్ఐ పి.వెంకటేష్ ఆధ్వర్యంలో దొర్నిపాడు పోలీసులు కోర్టులో సాక్ష్యాదారాలతో నిరూపించారు. దీంతో ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జికోర్టు న్యాయాధికారి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ చిలంకూరు పుల్లయ్యకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మహబూబ్‌బాషా మృతదేహం

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతచెక్‌పోస్టు సమీపంలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ మహబూబ్ బాషా (40) అనే వ్యక్తి అప్పులబాధ తాళలేక బుధవారం అర్ధరాత్రి దాటాక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మకూరు మండలంలోని వడ్లరామా పురం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాకు 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. మహబూబ్ భార్య 15ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆరేళ్ల క్రితం మహబూబ్ బాషా నందికొట్కూరుకు చెందిన ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూడా ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా ఆమె కూడా భర్తతో గొడవపడి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలోనే మహబూబ్ బాషా కొణిదేల గ్రామానికి చెందిన ఓ మహిళతో కలిసి ఆత్మకూరులోని పాత చెక్‌పోస్టు సమీపంలో నివాసం ఉంటున్నారు. మహబూబ్‌బాషా రూ.2 లక్షలు డౌన్ పేమెంట్ చెల్లించి కొత్త లారీ కొన్నాడు. ఈఎంఐలు చెల్లించలేక మరొక వ్యక్తికి లారీ ఇచ్చాడు. ఆయన కూడా ఈఎంఐలు చెల్లించలేక మహ బూబ్‌బాషాకే వెనక్కి ఇచ్చేశాడు. ఈఎంఐలు పెండింగ్ ఉండటంతో ఫైనాన్స్ సంస్థ లారీని సీజ్ చేసింది. దీంతో పూర్తిగా అప్పుల పాలైన మహబూబ్‌బాషా బుధవారం రాత్రి డబ్బులు ఇవ్వాలని సహజీవనం చేస్తున్న మహిళతో వాగ్వాదానికి దిగాడు. తర్వాత ఇరువురు నిద్రించారు. అయితే మహబూబ్ బాషా ఉరివేసుకున్నారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో ఆ మహిళ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఏఎస్ఐ శంకరరెడ్డి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

బాలాజీ నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో గురువారం చైన్ స్నాచింగ్ జరిగింది. సరస్వతమ్మ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించారు. సరస్వతమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు పూలు కోసుకుంటుం డగా.. ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి ఆమెను ఏదో సమాచారం అడిగారు. అర్థం గాక.. ఆమె వెనక్కి తిరిగేసరికి చటుక్కున ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించారు. గొలుసు 2 తులాలు పైబడి ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌడేశ్వరీదేవి విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన చౌడేశ్వరీదేవి విగ్రహం

పాములపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మిట్టకందాల వెళ్లె రహదారిలో పాములపాడు పొలమేర గ్రామ దేవత చౌడేశ్వరీదేవి విగ్రహాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం దర్శనానికి వెళ్లిన భక్తులకు ధ్వంసం అయిన విగ్రహం, దేవాలయంలో రాళ్ళు పడి ఉండటం చూసిన భక్తులు గమనించారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని భక్తులు కోరారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకం



శిక్షణ ఇస్తున్న డీఈ రవీంద్రారెడ్డి

- నంద్యాల ఇన్‌చార్జి పీఆర్ ఎస్ఈ కే నాగరాజు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకభూమిక పోషించాలని నంద్యాల పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ కే. నాగరాజు అన్నారు. నంద్యాల పీఐయూ డివిజన్ పరిధిలోని 125 ఇంజనీరింగ్ అసిసెంట్లకు గురువారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి, ఏఈ విజయభాస్కర్, ఏఈఈ అమర్‌నాథ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఎలా పాటించాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఒక్కో మండలానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఈ పనుల జరిపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఐయూ ఈఈ రఘురాంరెడ్డి, డీఈఈ గంగాధర్, ఏఈ ప్రభాకర్, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు


మంత్రి ఫరూక్‌కు తిరుమల ప్రసాదాన్ని అందిస్తున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను, పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ గురువారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని మల్లెల రాజశేఖర్ మంత్రి ఫరూక్‌కు అందించారు. టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, కుమ్మరి శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మెన్ తుగ్గలి నాగేంద్ర, నాగభూషణం రెడ్డి, తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలి'

ఆత్మకూరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీ, బ్యాంకులు, పోస్టల్ తదితర సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 న స్థానిక పాతబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే కళాజాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్ కుమార్, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రాంనాయక్, ప్రజా సంఘాల నాయకులు నరసింహ నాయక్, వీరన్న, మాబాషా, నాగేశ్వరరావు, సురేంద్ర, చాంద్‌బ, బొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో 12 మందికి గాయాలు

నందికొట్కూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్క స్వైర విహారం చేయడంతో 12 మంది గాయపడ్డారు. గురువారం పట్టణంలోని తాలుకా ఆఫీసురోడ్డు, రాజా వీధి, కోటా వీధుల్లోని 12 మందిని ఓ కుక్క కరిచింది. బాధితులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మహానంది, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాజులపల్లిలో మూడు రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయిన బాధితులకు మండల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం తహసీల్దార్ రమాదేవి చేతుల మీదుగా సభ్యులు నిత్యవసర సరుకులతో పాటు వంట సామగ్రి, దుప్పట్లు, 50 కేజీల బియ్యం, టార్పాలిన్ పట్ట లను అందించారు. మండల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్, వైస్ చైర్మన్ కమలాకర్ నాయిడు, ట్రెజరర్ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు మద్దిలేటి, లాల్‌మదార్, సత్యనారాయణ, మదన శేఖర్, టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, కలర్స్ రవినాథరావు, వీఆర్వో జోజిబాబు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పూజలు

శ్రీశైలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మాసం పురస్కరించుకుని క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వేకకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు. పలువురు భక్తులు లక్ష ఒత్తుల నోములను నోచుకున్నారు. సాయంత్రం ఆలయ ధ్వజస్థభం వద్ద ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగాలని గణపతి పూజను నిర్వహించి, దీప ప్రజ్వలన, దీపారాధనలను జరిపారు. దత్తా త్రేయ స్వామికి లోకకల్యాణార్థం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో విజయవాడకు చెందిన నాట్యతరంగిణి కూచిపూడి డాన్సు ఇన్‌స్టిట్యూట్ బృందంతో, నందికొట్కూరుకు చెందిన సాయి నృత్యకళాశాల బృందం సభ్యులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

అన్నప్రసాద భవనం పరిశీలన

శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఆలయ ఇన్‌చార్జి ఈవో ఈ.చంద్రశేఖరరెడ్డి పరిశీలించారు. వంటశాలలో వండిన వంటకాలు, ప్రాంగణాన్ని, వంట పదార్థాలు, కూరగాయలు భద్రపరచు గదులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులతో అన్న ప్రసాద వితరణపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.


ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్న అధికారులు, అర్చకులు

రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండలంలోని మంచాలకట్ట గ్రామంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్‌లను, బూజనూరు గ్రామంలో సచివాలయం, రైతు సేవా కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు పారిశ్రామికవాడగా తీర్చిదిద్ది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై గుంతలను పూడ్చేందుకు రూ.210 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతుల ఆవశ్యకతను సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. రూ.43 కోట్లతో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేశామని ఆమె పేర్కొన్నారు. గడివేముల, మంచాలకట్ట, గని గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి నుంచి బాధితులకు వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, కృష్ణాయాదవ్, మురళీమోహన్‌రెడ్డి, గని హర్షవర్దన్, గిరిబాబు, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, బూజనూరు సర్పంచ్ రాములమ్మ, ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ, మండల అధికారులు పాల్గొన్నారు.


మంచాలకట్టలో ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

'చెంచులు స్వయం ఉపాధిలో రాణించాలి'

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చెంచులు స్వయం ఉపాధిలో రాణించాలని ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా అన్నారు. బైర్లూటి చెంచుగూడేంలో నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం వారి సహకారంతో లిటిల్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బట్టసంచుల తయారీ శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బైర్లూటి, నాగలూటి రేంజ్ అధికారులు కృష్ణప్రసాద్, దొరస్వామి, డీఆర్వో జాకీర్, ఎఫ్‌బీవో ముర్తుజావలి, శిక్షకులు సునీత తదితరులు ఉన్నారు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం'

మిడుతూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని మిడుతూరు మండల 104 వాహన సిబ్బంది జగదీస్, శఖర్ తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులుకు గురువారం వినతిపత్రం అందించారు.

ఆచార్య ఎన్జీ రంగా జయంతి

నంద్యాల కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతిని గురువారం నంద్యాల నంది రైతు సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీరంగా చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డా. రవీంద్రనాథ్, రైతు నాయకులు తూము శివారెడ్డి, మాధవస్వామి, హరినాథ్‌రెడ్డి, కవి నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో నాణ్యమైన దిగుబడులు

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో నాణ్యమైన దిగుబడులు సాధ్యం అని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సంచాలకులు సరళమ్మ ఆధ్వర్యంలో ఆర్ఏఆర్ఎస్‌లో వ్యవసాయ నైపుణ్య సామర్థ్యం పెంపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మురళీకృష్ణ హాజరై రైతులు సాగుచేస్తున్న పంటలకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను, మెళకువలను వివరించారు ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, పథకాల ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్త రాదాకుమారి మాట్లాడుతూ శనగ పంట, పొద్దుతిరుగుడు పంటలలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త రామకృష్ణారావు మొక్కజొన్న, వరి, శెనగ, మినుము పంటలలో అనుసరించాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలను, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను తెలియజేశారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట ఆవశ్యకతను రైతులకు తెలియజేస్తూ పంట విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. జిల్లాలోని అన్ని మండల వ్యవసాయాధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

పాణ్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్దూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సునీత ఆధ్వర్యంలో గురువారం మద్దూరులో జాతీయ కేన్సర్ అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అభిషేక్, సుబ్బా రెడ్డి, ప్రసాద్, భువనశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానంది: ఎం.తిమ్మాపురంలో కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డాక్టర్ వేణు ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్ఎన్ అమీనాభాయ్, ఏఎన్ఎం భార్గవి, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: తొలిదశలోనే కేన్సర్‌ను గుర్తించడం వల్ల చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని బావనంతాపురంలో గురువారం జాతీయ కేన్సర్ ఇవారణపై బైర్లూటి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ నెల 14 నుంచి ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో ఫాతిమా, ఆరోగ్య కార్యకర్తలు, భాస్కర్, విశ్వనాథ్, భీమేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకుడు

శ్రీశైలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం శ్రీశైలానికి చెందిన పి.ప్రభావతి అనే భక్తురాలు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు సి.మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

పాణ్యం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను డీఈవో జనార్దనరెడ్డి గురువారం తనిఖీ చేశారు. నెరవాడ మెట్ట వద్ద బాలికల పాఠశాలలోని డైనింగ్‌హాల్, ఆర్వో ప్లాంటు, డార్మెట్రీ, క్లాస్ రూములు, బాత్‌రూమ్‌లు, స్టోర్ రూం, వంటగది పరిశీలించారు. అనంతరం బాలికల సమస్యలు తెలుసుకున్నారు. బాలికల శాతాన్ని పెంచాలని ప్రిన్సిపాల్ మేరీ సలోమిని ఆదేశించారు. డార్మెట్రీల్లో సరైన వెంటిలేషన్ లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాలికలు తెలిపారు. ఫ్యాన్‌లు లేని చోట్ల వెంటనే ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయుని కొరత ఉండడంతో విశ్రాంత ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని ప్రిన్సిపాల్ తెలిపారు. మెనూ సక్రమంగా పాటించాలన్నారు. బాత్‌రూంలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాల్వ నిర్మాణం లేక నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు చెప్పారు. ఎంఈవో కోటయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలి

నందికొట్కూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఏఐటీయూసీ నాయకుల రఘురామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తాపీ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని నందికొట్కూరు తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్దుల్‌మునాఫ్, అబ్దుల్ సలాం, రహంతుల్లా, స్టార్ వల్లి, అయూబ్, అబ్దుల్, కలీల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు ఈనెల 9, 10, 23, 24 వ తేదీలలో మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రియదర్శిని తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆయా తేదీల్లో గ్రామాలలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు.

'మహిళల జీవనోపాధికి డీఆర్‌డీఏ సహకారం'

నంద్యాల రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళల జీవనోపాధి మెరుగుకోసం డీఆర్‌డీఏ సహకారం అందిస్తుందని పీడీ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. గురువారం నంద్యాల డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏసీఎస్, ఏపీఎంఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల బ్యాంక్ లింకేజీ, మొబైల్ బుక్ కీపింగ్, స్త్రీ నిధి, ఉన్నత పథకాల రికవరీ తదితర అంశాలపై చర్చించారు. నంద్యాల అన్ని విభాగాలలో కూడా రాష్ట్ర స్థాయిలో మంచి ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేయాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోస్పాడు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోస్పాడులో గురువారం 105 క్వింటాళ్ల రేషన్ బియ్యంను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోస్పాడుకు చెందిన అన్వర్ గోడౌన్ లో రేషన్ బియ్యం ఉన్నాయన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ వీఆర్వో రవీందర్, ఆర్ఐ చంద్రశేఖర్‌రెడ్డిలతో వెళ్లి గోడౌన్‌లోని బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నంద్యాల సివిల్ సప్లయ్ గోడౌన్‌నకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు దుద్యాల గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి గంగాధర్ రెడ్డి ఎంపికైనట్లు హెచ్ఎం కృష్ణమోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం దుద్యాల పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, కృష్ణయ్య, రాఘవేంద్ర, విజయకుమార్, రామయ్య, వసుంధర, భారతి, నూర్జహన్, శ్రీసుధ ఉన్నారు.

ఆత్మకూరు: మండలంలోని కరివేన సమీపంలో గల డీపాల్ హైస్కూల్‌కు చెందిన యుగంధర్, మోహన్ కృష్ణసాయి అనే విద్యార్థులు బాక్సింగ్ క్రీడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షిన్స్, వైస్ ప్రిన్సిపాల్ వినీత్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 24వ తేది వరకు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో తమ క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. బాక్సింగ్ కోచ్ ఉపేంద్ర ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కోట్ల

డోన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కోట్ల పట్టణంలోని తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారు తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించేలా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ నాగమణి, సబ్ రిజిస్ట్రార్ మహబూబ్ బాషా, సబ్ ట్రెజర్ అధికారి రఘునందన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ దాదాపీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న నంద్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బేస్‌బాల్, స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. అండర్-17 బాలుర విభాగంలో పండు, నిరంజన్, బాలికల విభాగంలో సమీర, మనిషా, అండర్-14 బాలుర విభాగంలో చిన్న, హరినారపుసింహ, బాలికల విభాగంలో నాగసంకీర్తన, మల్లికాలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. 14వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ స్కూల్‌గేమ్స్ పోటీలు ఈ నెల 9న తిరుపతిలో జరుగుతాయని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కమిటీ ఛైర్మన్ గౌస్‌మోద్దీన్, హెచ్ఎం కోటయ్య, సీనియర్ ఉపాధ్యాయులు, పీఈటీ భారతి అభినందించారు.

యాగంటి ఆలయానికి వెండి వస్తువులు

బనగానపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి గడివేముల మండలం గని గ్రామానికి చెందిన ఎస్.శంకర్ కుటుంబ సభ్యులు వెండి వస్తువును బహూకరించారు. గురువారం ఆలయ ఈవో చంద్రుడు, బండి మహేశ్వరరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులకు వీటిని దాతలు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి, ఆశీస్సులు అందజేశారు.


పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరు, ఆవులపల్లె గ్రామాల్లోగల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

కళ తప్పిన పూల రైతు

భారీగా పడిపోయిన ధరలు

పంట చేలను దున్నేస్తున్న రైతులు



సీతారామాపురంలో రైతులు వదిలేసిన చామంతి పూల తోట

బేతంచెర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చామంతి పూల రైతులు నష్టాల కూరుకుపోయారు. పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో పూల చేలను దున్నేస్తున్నారు. మండలంలోని సీతారామాపురం, సంకలాపురం, బైనపల్లె గ్రామాల్లో చామంతి పూలు తోటలకు ప్రసిద్ధి. ప్రతి ఏడాది చామంతి పూలకు, మంచి ధర ఉండేది. కేజీ పూజలు రూ.100 నుంచి రూ.130 వరకు పలికేవి. వీటిని గుంటూరు విజయవాడ తదితర ప్రాంతాలకు రవాణ చేసేవారు. అయితే ఈ ఏడాది కిలో రూ.30 కూడా పలకకపోవడంతో భారీగా నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పసుపు, తెలుపు రంగు ఉన్న చామంతి పూలు ఎక్కువగా సాగు చేస్తారు. అయితే చామంతి పూల ధర రూ.30కు పడిపోవడంతో సాగు ఖర్చులు కూడా చేతికందక పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సాగు ఖర్చు ఎకరాకు రూ.1.50 లక్షలు వస్తుందని, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందకుండా పోవడంతో కొంత మంది రైతులు చామంతి పొలాలను దున్నేశారు. ఇప్పటికైనా చామంతి పూల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



భారీగా నష్టపోయాం

చామంతి పూల రైతులు ఈ ఏడాది భారీగా నష్టపోయారు. చామంతి పూల ధర పతనం కావడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. చామంతి పూల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- రైతు బోయ రామనాయుడు, సీతారామాపురం

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి





బనగానపల్లె, అవుకు పట్టణాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టంగుటూరి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివశంకరుడు అన్నారు. గురువారం కాన్సర్ అవగాహన ర్యాలీని వైద్య సిబ్బందితో కలిసి నిర్వహించారు. త్వరలో ప్రభుత్వం క్యాన్సర్‌పై ప్రత్యేక సర్వే చేపట్టనుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, అయ్యమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

● **అవుకు:** క్యాన్సర్ వ్యాధిని ముందుస్తు పరీక్షలతో అరికట్టవచ్చని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వినోద్‌కుమార్, యమున, నవీన్ అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఐటీఐ కళాశాల విద్యార్థులతో ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

● **బేతంచెర్ల:** మండలంలోని సిమెంటునగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా డా.మెహతాబ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రూతమ్మ, ఎంఎల్‌పీహెచ్‌ఎస్ సువర్ణ, రాజేశ్వరి, ఏఎన్ఎం పరీదాభాను, మదువరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆశాలు రాణి, శాంతమ్మ, పుల్లమ్మ, నూర్జహాన్, మాధవి పాల్గొన్నారు

శిరివెళ్ల: విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్, జంతుశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో క్యాన్సర్ వ్యాధి గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దురలవాట్ల వల్ల ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● **రుద్రవరం:** క్యాన్సర్‌పై విజయం స్కానింగ్‌తో సాధ్యమని వైద్యాధికారులు అమర్‌నాథరెడ్డి, బాబు అన్నారు. గురువారం మండలంలోని ఆలమూరు, నరసాపురం గ్రామాల్లో జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే పాఠశాల పిల్లలు కూడా అవగాహన కల్పించారు.



బేతంచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, రుద్రవరంలో విద్యార్థుల మానవహారం



డెంగీ పట్ల నిర్లక్ష్యం వద్దు

డోన్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న యూపీహెచ్‌సీ సెంటర్‌ను పాతపేట ఏరియా ఆసుపత్రులను అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ల్యాబులను, పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడే డాక్టర్లతో సీజనల్ వ్యాధులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, యూపీహెచ్‌సీ సెంటర్ల డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



డాక్టర్లతో చర్చిస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

ప్రైవేటు స్కూళ్లకు అండగా నిలుస్తాం

డోన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు తమ యూనియన్ అండగా నిలుస్తుందని అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్స్ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జే చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల్లో నష్టపోయిన చిన్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు, వాటిలో పని చేస్తున్న ఉపాధ్యాయ కుటుంబాలకు నంద్యాల జిల్లా డోన్ తరుపున రూ.5 లక్షలు విరాళాలు సేకరించి బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. తమ యూనియన్ తరపున చిన్న ప్రైవేటు స్కూళ్ల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం త్యాగం చేసిన చిరస్మరణీయులను స్మరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు బిపిన్ చంద్రపాల్, శాస్త్రవేత్త సర్‌సీవీ రామన్ జయంతి సందర్భంగా పట్టణంలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి

కోవెలకుంట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు రాజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివశంకర్‌రెడ్డి, జహీరాబీ, నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, శ్రీపతి, తిరుపతిరెడ్డి, సుగుణ, శైలజ, ఓబులేసు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

డోన్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదును ఎలా చేయించుకోవాలనే విషయాలపై తహసీల్దార్ నాగమణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చంద్రకళాధర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సాయి పల్లకి ఉత్సవం

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని సాయి నాథ మందిరంలో గురువారం సాయి బాబా పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు సామూహికంగా దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. సాయి వ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు

చాగలమర్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా గురువారం మహిళలు శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి ఆధ్వర్యంలో విష్ణుసహస్ర పారాయణం, సామూహిక వడిబియ్యం కార్యక్రమం చేశారు. శివపార్వ తుల పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సాయినాథుడికి..

రుద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. చందలూరులో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేశారు. రుద్రవరంలో పూలమాలలతో సాయినాథుడి చిత్రపటాన్ని అలంకరించారు.

రేషన్ కోసం పేదల ఆందోళన



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న చంద్రపల్లి గ్రామస్తులు

ప్యాపిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపల్లి గ్రామస్తులు రేషన్ కోసం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రమణయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, క్రిష్టన్న, సుబ్బయ్యలు మాట్లాడుతూ గ్రామంలోని రేషన్ దుకాణంలో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని అన్నారు. మార్కెట్లో అధిక ధరలు పెట్టి చెక్కర, బేడలు కొనలేక ఇబ్బందులకు గురవుతున్నామని, రేషన్ దుకాణంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతర తహసీల్దారు భారతికి వినతి పత్రం అందజేశారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పించాలి

డోన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పించాలని డోన్ బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి పులి దామోదర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలతో తరహా ఆంధ్ర రాష్ట్రంలో న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని 26 బార్ అసోసియేషన్లకు మెమోరాండం పంపినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేలా జిల్లాల బార్ అసోసియేషన్ నాయకులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

క్షేత్ర సహాయకుడిపై విచారణ

రుద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఉపాధి కార్యాలయంలోని క్షేత్ర సహాయకుడిపై ఏపీడీ సాంబశివరావు గురువారం విచారణ జరిపారు. మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంటు పాములేటిపై విచారణ నిర్వహించారు. ఎన్నికల ముందు వచ్చిన ఫిర్యాదులు గ్రామంలో జాబ్‌కార్డుల కోసం చేసిన ఫిర్యాదులపై విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్ తదితరులు ఉన్నారు.

కంప చెట్ల తొలగింపు



ముళ్లకంపల చెట్లను తొలగించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఛైర్మన్

డోన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ పరిసరాల్లో కంప చెట్ల తొలగింపునకు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేశ్ ఆదేశాలు ఇచ్చారు. అయ్యప్పస్వామి ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని మున్సిపల్ సిబ్బందికి ఛైర్మన్ ఆదేశాలు చేశారు. ఈ మేరకు ఆయన ఆలయ పరిసరాల్లో ఉన్న ముళ్ల కంపల ప్రదేశాలను పరిశీలించారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది ముళ్లకంపలను తొలగించారు. ఆయన వెంట వైస్ ఛైర్మన్ జాకీర్‌హుసేన్ ఉన్నారు.

మురికి కాలువల పనులు పరిశీలన



మురికి కాలువల పనులు పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని దళిత కాలనీలో కొనసాగుతున్న మురికి కాలువల పనులను గురువారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్‌లు పరిశీలించారు. 360 మీటర్లు మురికి కాల్వలు, 200 మీటర్లు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలనీ ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం ఉన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు: సీఐ

బేతంచెర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే తాట తీస్తానని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సస్పెక్టెడ్ రౌడీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో రాయితీ వేరుశనగ

బేతంచెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ వేరుశనగ అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. కే-6 వేరుశనగ రకం 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. వేరుశనగ పూర్తి ధర క్వింటానికి రూ.9,600 ఉండగా అందులో రూ.3,840 సబ్సిడీ పోను రైతుల రూ.5760 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

దొర్నిపాడులో టీడీపీ సభ్యత్వం నమోదు

దొర్నిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నంద్యాల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకుంటే వారికి ప్రమాదశవాత్తు మరణిస్తే వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా టీడీపీ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో చలుంగారి అంకన్నయాదవ్, బాలిరెడ్డి, ఐటీడీపీ శ్రీను, మల్లికార్జున, చింతల గుర్రప్ప తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పీఈటీ ఎంపిక

సంజామల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ చాంపియన్‌షిప్ పోటీలకు సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకులు బాషా ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 6న గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 40ప్లస్ విభాగంలో పాల్గొన్న బాష డిస్కస్ త్రోలో మొదటి స్థానం, షార్ట్‌పుట్ త్రోలో ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో బాషా పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.



వ్యాయామ సంచాలకులు బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం